సాక్షి
కాకినాడ
ఆదివారం । 16 । జూన్ । 2024



రూ.1,00,116 విరాళం


అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి వనుపులేటి సుజాత (హైదరాబాద్) శనివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



మహదానందమే... మహా భాగ్యమే

నిత్య కల్యాణం.. పచ్చతోరణంగా విరాజిల్లుతున్న అప్పనపల్లి శ్రీబాల బాలాజీస్వామి ఆలయం దివ్య తిరు కల్యాణ మహోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. 8లో

డెల్టాలకు 8,200 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 8,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,500, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.40 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఎస్సై హఠాన్మరణం

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



ఎస్సై వెంకట రమణ (ఫైల్)

కోటనందూరు: సీఐడీ విభాగంలో అమరావతిలో ఎస్సైగా పని చేస్తున్న కోటనందూరుకు చెందిన పంపనబోయిన వెంకట రమణ విజయవాడలో హఠాన్మరణం చెందారు. వెంకట రమణ (54) ఆర్మీలో 23 సంవత్సరాల పాటు సైనికుడిగా సేవలందించారు. ఎన్‌ఎస్‌జీ కమాండో, హవల్దార్, సబ్ ఇన్‌స్పెక్టర్ తదితర హోదాల్లో పని చేశారు. ఆర్మీలో ఉద్యోగ విరమణ అనంతరం 2010లో సివిల్ ఎస్సైగా అర్హత సాధించి రాష్ట్రంలో ఉద్యోగంలో చేరారు. ప్రస్తుతం సీఐడీ ఎస్సైగా పని చేస్తున్నారు. గురువారం సాయంత్రం చంద్రబాబు ప్రమాణ స్వీకారం విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన వెంకట రమణ శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో బాత్ రూములో పడి మృతి చెందారు. ఆయన కుటుంబం కాకినాడలో నివాసం ఉంటోంది. వెంకట రమణ కుమారుడు శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. కుమార్తె ఇంటర్ పూర్తి చేసి, నీట్ పరీక్ష రాసింది. వెంకట రమణ మృతదేహాన్ని కోటనందూరు తీసుకుని వచ్చి, అశేష జనసందోహం నడుమ ఊరేగించి, అధికారిక లాంఛనాలతో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. సీఐడీ, పోలీసు సిబ్బంది వెంకట రమణ పార్థివ దేహానికి గౌరవ వందనం చేశారు.

పంచారామ క్షేత్రంలో నేడు సంప్రోక్షణ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో ఆదివారం సంప్రోక్షణ నిర్వహిస్తామని ఈఓ బళ్ల నీలకంఠం శనివారం విలేకర్లకు తెలిపారు. ఆలయంలో కుమారారామ భీమేశ్వరస్వామి శివలింగం జీర్ణోద్ధరణ పనుల్లో భాగంగా గత నెల 29 నుంచి స్వామి, అమ్మవారి గర్భాలయాలను మూసివేసి, దర్శనాలు నిలిపివేశామని చెప్పారు. కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యాన జరిగిన జీర్ణోద్ధరణ పనులు శనివారంతో పూర్తయ్యాయన్నారు. దీంతో ఆలయంలో ఆదివారం సంప్రోక్షణ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొంటారన్నారు. సోమవారం ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులకు స్వామివారి మూలవిరాట్టు దర్శనం కల్పిస్తామని, అభిషేకాలకు ఈ నెల 23 నుంచి మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు.

17న హాకీ క్రీడాకారుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఈ నెల 17న సీనియర్స్ పురుషుల విభాగంలో హాకీ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నామని జిల్లా హాకీ సంఘం కార్యదర్శి నంబు శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా క్రీడా మైదానంలోని హాకీ మైదానంలో ఉదయం 7 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. ఈ ఎంపికలకు 1995 జనవరి ఒకటో తేదీ తరువాత పుట్టిన వారు అర్హులన్నారు. ఎంపికైన జట్టు ఈ నెల 27 నుంచి 30 వరకూ అనంతపురం జిల్లా ధర్మవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు హాకీ కోచ్ రవిరాజు పర్యవేక్షణలో జరిగే ఈ ఎంపికలకు హాజరు కావాలని కోరారు.

అన్నవరప్పాడుకు పోటెత్తిన భక్తులు

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం వేలాదిగా భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తులు అధిక సంఖ్యలో రావడం మొదలైంది. ఉదయం 6 గంటలకే ఆలయ ప్రాంగణం చుట్టూ బారులు తీరారు. ఒక దశలో భక్తుల క్యూ జాతీయ రహదారి పైకి చేరింది. స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. సుమారు 6 వేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించామని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

నడిపించే దైవం నాన్న

నాన్న అంటే నమ్మకం.. నడిపించే దైవం.. జీవితానికి మణిదీపం.. అనురాగ సౌరభం.. అనుబంధానికి నిలువెత్తు సాక్ష్యం.. ప్రేమకు ప్రతిరూపం.. నేనున్నానని భుజం తట్టే శిఖరం.. కటువుగా ప్రవర్తించినా సన్మార్గంలో నడిపించే రక్షణ కవచం.. అందమైన లోకం.. అలాంటి తండ్రి గురించి వర్ణించడం ఎవరి తరమూ కాదు. ఆదివారం అంతర్జాతీయ పితృ దినోత్సవాన్ని పురస్కరించుకుని సాక్షి ప్రత్యేక కథనం..

- అన్నీ తానై జీవితానిచ్చే మణిదీపం
- నేడు అంతర్జాతీయ పితృ దినోత్సవం



నాన్న రెక్కలు తోడుగా.. నవ్యలోకాలకు..

సాక్షి, అమలాపురం: ఒకప్పుడు ఇంటికి నాన్న వస్తున్నాడని తెలిస్తేనే పిల్లలు ఆందోళన పడేవారు. తాము చేసిన తప్పులు చెప్తే నాన్న ఎక్కడ దండిస్తాడో అనే భయం ఉండేది. నాన్న సైతం పిల్లల వద్ద అంతే గాంభీర్యాన్ని ప్రదర్శించేవారు. మనసు నిండా ప్రేమ ఉన్నా వారి వద్ద మాత్రం కఠినంగానే ఉండేవారు. అదే పెద్దరికం అనుకునేవారు. 'అమ్మా... నాన్నకు చెప్పు నేను ఇంకా పైచదువులు చదువుకుంటాను' అని ఒక కూతురు.. 'నాన్నకు నువ్వు చెప్పమ్మా.. స్నేహితులతో కలసి నేను సినిమాకు వెళ్తాను' అని ఒక తల్లితో కొడుకు సిఫారసు చేయించుకున్నా దాని వెనుక నాన్నంటే ఒక భయం ఉండేది. కానీ ఇప్పుడు కాలం మారింది. నాన్న కూడా మారిపోయాడు. పెద్దరికం స్థానంలో స్నేహితుడయ్యాడు. గాంభీర్యం స్థానంలో గారాభం పెరిగింది. తండ్రి మెడ చుట్టూ చేతులు వేసి మారం చేస్తున్న పిల్లలకు కొదవలేదు. పిల్లల మనసులు తెలుసుకుని నాన్న నడుచుకుంటున్నాడు. తమ పిల్లలను సమాజంలో ఉన్నతంగా తీర్చిదిద్దే నడవడిక నేర్పే గురువుగా మారాడు. పిల్లలకు ఏం కావాలో ముందుగానే గ్రహించి అందించే మంచి వ్యక్తిగా చెరగని ముద్ర వేస్తున్నాడు. చాలామంది తండ్రులు మాత్రం తమ పిల్లలు తమకన్నా ఉన్నత స్థాయిలో ఉండాలని కలలు కంటున్నారు.

ఒక కవి చెప్పినట్టు 'నాన్న అంటే త్యాగం.. నాన్న అంటే ప్రేమతోకూడిన బాధ్యత.. నాన్న అంటే ఎత్తైన శిఖరం.. తన రెక్కలు ముక్కలు చేసుకుని రేయి పగలు కష్టపడి, పిల్లలకు, కుటుంబానికి కవచంగా నిలిచేవాడు. తాను ఓడిపోయి పిల్లలను గెలిపించే త్యాగశీలి' ఇలా చెప్పుకుంటూ పోతే నాన్నకు నిర్వచనం చెప్పేందుకు మాటలు చాలవు, రాసేందుకు పదాలు సరిపోవు అంటే అతిశయోక్తి కాదు..

తపించి.. భవిష్యత్తు చూపించి



కుంపట్ల నాగేశ్వరరావు

పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లికి చెందిన కుంపట్ల నాగేశ్వరరావు సాధారణ కొబ్బరి ఒలుపు కార్మికుడు. అతనికి ముగ్గురు కుమార్తెలు. కుటుంబ పోషణ కోసం గతంలో గల్ఫ్ దేశానికి వెళ్లారు. పెద్దగా చదువు లేకపోవడంతో అక్కడ సాధారణ కార్మికుడిగా పనిచేయడం వల్ల తక్కువ వేతనం వచ్చేది. నాగేశ్వరరావు తన ముగ్గురు కుమార్తెలను ఉన్నత చదువులు చదివించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గల్ఫ్‌లో వస్తున్న చాలీచాలని జీతాలతో ప్రయోజనం లేదని తిరిగి వచ్చేసిన ఆయన ఇక్కడ కొబ్బరి కార్మికుడిగా జీవనోపాధి పొందుతూనే పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. పెద్ద కుమార్తె వరలక్ష్మి డీఎడ్ పూర్తి చేశారు. రెండో కుమార్తె వెంకట రమ్య బీఈడీ చేసి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించారు. ప్రస్తుతం ఆమె ప్రత్తిపాడు మండలం పాండవులపాలెంలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్నారు. మూడో కుమార్తె భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కాలేజీలో ఇంజినీరింగ్ పూర్తి చేసి ఇటీవల హైదరాబాద్‌లోని ఓ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించారు. ఉన్నత చదువులు చదివిన ఈ కుమార్తెలు తండ్రి ఆశయాన్ని నెరవేర్చారు. అహర్నిశలూ కష్టపడి తమ చదువుకు ఎటువంటి ఇబ్బంది రాకుండా ఉండాలని తన తండ్రి నిరంతరం తపించే వారని, అతను అందించిన స్ఫూర్తితో ఉన్నత చదువులు చదువుకున్నట్టు కుమార్తెలు చెబుతున్నారు.



నాగేశ్వరరావు భార్యతో ఉన్నత చదువులు చదువుకున్న కుమార్తెలు

ఆయనే మాకు స్ఫూర్తి..

కాట్రేనికోన మండలం లక్ష్మీవాడకు చెందిన మా నాన్న సూర్యనారాయణమూర్తి చదువు ప్రాధాన్యం తెలిసిన వ్యక్తి. సింగరేణిలో ఉద్యోగిగా పనిచేశారు. నాన్నకు ముగ్గురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలం. నేను ఎంబీబీఎస్ చదివి ప్రస్తుతం వైద్య ఆరోగ్య శాఖలో రామచంద్రపురం సబ్ డివిజనల్ అధికారిగా పనిచేస్తున్నాను. నాతోపాటు నా సోదరులు ఇద్దరూ మంచి చదువులు చదువుకోవడం వెనక నాన్న ప్రోత్సాహమే కారణం. అమ్మాయిలు సమాజంలో తమ కాళ్లపై తాము జీవించాలని, అందుకు చదువే ఆధారమని చెబుతూ ఉండేవారు. అందుకు అనుగుణంగా నడుచుకున్నాం. అక్క ప్రసన్నలక్ష్మి సోషియాలజీలో ఎంఏ ఎంఫిల్ పూర్తి చేసి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విద్యాబోధన చేస్తుంది. చెల్లి ప్రవీణకుమారి ఎంబీఏ పూర్తి చేసి 2019లో సచివాలయ మహిళా పోలీస్‌గా ఉద్యోగంలో చేరింది. ఇలా ముగ్గురమూ జీవితంలో స్థిరపడడానికి నాన్నే స్ఫూర్తి.



-ఎన్.ప్రశాంతి, సబ్ డివిజనల్ ఆఫీసర్, వైద్య ఆరోగ్య శాఖ, రామచంద్రపురం డివిజన్



తండ్రి సత్తిరాజుతో యడ్ల దుర్గాప్రసాద్

నాన్న వల్లే ఇస్రో శాస్త్రవేత్తనయ్యా..

మా నాన్న పేరు యడ్ల సత్తిరాజు. రాయవరం మండలం వెదురుపాక మా స్వగ్రామం. మేము ముగ్గురు అన్నదమ్ములం. మా నాన్న వ్యవసాయం చేస్తారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ మా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నా. పాలిటెక్నిక్ విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, బి.టెక్ బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో, ఎం.టెక్ డెహ్రాడూన్‌లోని సీఎస్ఐఆర్ ఐఐటీలో చదువుకున్నాను. మా నాన్న వ్యవసాయం చేసి కష్టపడి చదివించారు. ఉన్నత చదువులు పూర్తయ్యే వరకూ మా అన్నదమ్ములందరినీ ప్రోత్సహించారు. నాన్న కష్టార్జితం, ప్రోత్సాహం నన్ను శ్రీహరికోట ఇస్రోలో ఈ క్వాలిటీ డిపార్ట్‌మెంట్ శాస్త్రవేత్తగా నిలిపింది. నా ఎదుగుదలకు కారణమైన నాన్నను నేను ఎన్నటికీ మరువలేను.

హితం కోరే మిత్రునిలా..



సంప్రాప్తే షోడశే వర్షే పుత్రం మిత్రవదాచరేత్... ఇది పేరెంటింగ్‌కి సంబంధించి చాణక్యుడి మాట. అంటే విజ్ఞుడైన తండ్రి పిల్లలకు కౌమారదశ దాటాక ఒక మంచి మిత్రునిలా మెలగాలి. తన జీవితానుభవాన్ని క్రోడీకరించి, ఆ పిల్లల్లో చక్కని వ్యక్తిత్వం రూపుదిద్దుకునేలా స్నేహితుడై సహకరించాలి. వర్తమాన ప్రపంచంలో ఏ పిల్లలకైనా ఈ నీతి వర్తిస్తుంది. ప్రస్తుతం పిల్లలు జీవితాన్ని చాలా ఈజీగా తీసుకుంటున్నారు. కానీ చాలా నిశ్చితమైనటువంటి అభిప్రాయాలు కలిగి ఉంటున్నారు. ఏ విషయాన్ని అయినా వేగంగా నేర్చుకోగలుగుతున్నారు. వారి స్వాభిమానాన్ని పెంపొందించేలా చిన్న చిన్న విజయాలను కూడా అభినందించడం, పనులు స్వయంగా చేసుకునేలా ప్రోత్సహించటం, విమర్శించకుండా తప్పుని ఎందుకు తప్పో చెప్పేలా ఉండాలి.



-డాక్టర్ శ్రీపాద రామకృష్ణ, కౌన్సెలింగ్ సైకాలజిస్టు, అమలాపురం

శృంగార వల్లభునికి రూ.3.81 లక్షల ఆదాయం



ఆలయంలో కిటకిటలాడుతున్న భక్తులు

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభస్వామి దర్శనానికి శనివారం వేలాదిగా భక్తులు పోటెత్తారు. స్వామివారికి ముడుపులు, మొక్కులు చెల్లించారు. ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు పూలమాలికలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల టికెట్లు, కేశఖండన, అన్నదాన విరాళాల రూపంలో స్వామివారికి రూ.3,81,911 ఆదాయం సమకూరిందని ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. స్వామివారిని సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారని, సుమారు 15 వేల మందికి ప్రసాద వితరణ, అన్నప్రసాదం ఏర్పాటు చేశామని వివరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కర్రి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభ స్వామి

దాడులకు భయపడొద్దు.. ప్రతిఘటిద్దాం

- శ్రేణులకు అండగా వైఎస్సార్ సీపీ
- రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు బోస్

అనపర్తి: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు జరగడం దురదృష్టకరమని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. అనపర్తిలోని ఆ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని దాడుల సంస్కృతి నేడు అనపర్తి చోటు చేసుకుందని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ శ్రేణులే లక్ష్యంగా జరుగుతున్న దాడులను సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని ఇక్కడకు వచ్చానన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భయపడవద్దని, ఈ దాడులను ఖండించడంతో పాటు ప్రతిఘటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. విజ్ఞులు, విద్యావంతులు, దేశాభివృద్ధిని కాంక్షించే నాయకులున్న బీజేపీ.. ఈ సార్వత్రిక ఎన్నికల్లో అనపర్తి నియోజకవర్గంలో తొలిసారి విజయం సాధించిందన్నారు. అటువంటి బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఇక్కడ ఇటువంటి దాడులు జరగడం బాధాకరమన్నారు. వీటిని పరిశీలిస్తే ప్రతిపక్ష కార్యకర్తలు, నేతలే లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు అర్థమవుతోందని అన్నారు. ఈ దాడులపై బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి కూడా భయపడుతున్నారంటే, ఎంతగా భయపెట్టారో తెలుస్తోందని చెప్పారు. ఈ ఘటనలపై పోలీసులు మౌనం వీడాలని, ఇటువంటివి పునరావృతం కాకుండా సుమోటోగా కేసులు నమోదు చేసి, విచారణ చేపట్టాలని, బాధితులకు అన్ని విధాలా భద్రత కల్పించాలని, దాడులకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న దాడులపై వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉదాసీనంగా వ్యవహరించరాదని, బాధ్యులపై చర్యలు తీసుకునే విధంగా పూర్తి కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఈ ఘటనలపై హైకోర్టును ఆశ్రయిస్తామని బోస్ తెలిపారు. సమావేశంలో సర్పంచ్ వారా కుమారి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఏడుకొండలు, కొండేటి భీమేష్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

అన్నదమ్ముల ఆత్మహత్య

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అయినవారు లేక.. కనీసం వంటి పెట్టే దిక్కు లేకపోవడంతో వారి జన్మ వృథా అనుకున్నారు.. దానికి తోడు దీర్ఘకాలిక రోగాలు ఉండడంతో నిస్సహాయతకు గురయ్యారు. వంతెనపై నుంచి దూకి ఆ అన్నదమ్ములు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన రాజమహేంద్రవరం శంభూనగర్ ఫ్లై ఓవర్ వద్ద శనివారం జరిగింది. ఆ వివరాల్లోకెళితే.. ముత్తా దుర్గారావు (40), ముత్తా నాగాంజనేయ (42) అన్నదమ్ములు. వీరి తల్లిదండ్రులు కొద్దికాలం కిందట చనిపోయారు. వీరిద్దరికీ పెళ్లిళ్లు కాలేదు. స్థానిక శంభూనగర్‌లోని సొంత ఇంట్లోనే ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వారిని పట్టించుకునే వారు లేకపోవడంతో వంట చేసుకునే వీలు లేక హోటల్ నుంచి ఫుడ్ రప్పించుకుని తింటుండేవారు. ఇందులో నాగాంజనేయకు షుగర్‌తో పాటు ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నాయి. అంతేకాక వీరి ఆస్తికి సంబంధించి కోర్టులో తగాదాలు నడుస్తున్నాయి. ఇదిలా ఉండగా శనివారం ఉదయం వీరిద్దరూ చనిపోదామని నిశ్చయించుకున్నారు. సాధారణ ఆటో అయితే వచ్చేందుకు నిరాకరిస్తారేమోననే ఉద్దేశంతో అంబులెన్స్‌ను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నారు. అది వచ్చాక రోడ్డు కం రైల్వే బ్రిడ్జి వద్దకు అని డ్రైవర్‌తో చెప్పారు. అక్కడకు వెళ్లాక విజ్జేశ్వరం అని మళ్లీ చెప్పారు. సరేనని అంబులెన్స్ డ్రైవర్ అక్కడకు తీసుకెళ్లాడు. అక్కడకు వెళ్లాక జనం అధికంగా ఉండడంతో వేరే చోటకు చెప్పడంతో అంబులెన్స్ డ్రైవర్‌కు అనుమానం వచ్చి గట్టిగా నిలదీశాడు. దీంతో వారు ఆత్మహత్య చేసుకుంటామని చెప్పారు. భయపడిన అంబులెన్స్ డ్రైవర్ వెంటనే వారిని తిరిగి ఇంటికి తీసుకువస్తుండగా, ఫ్లై ఓవర్ వంతెన వద్ద ఆపమన్నారు. వెంటనే ఆ అన్నదమ్ములను దింపి డ్రైవర్ వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో వారు ఫ్లై ఓవర్ నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నారు.

నల్లబాటికి విశిష్ట పురస్కారం

రామచంద్రపురం: పెందోట సాహిత్య పురస్కారానికి తెలుగు రాష్ట్రాల నుంచి పట్టణానికి చెందిన నల్లబాటి రాఘవేంద్రరావు రచించిన కథల సంపుటి గ్రంథం 'స్వర్ణ శిఖరాలు' (2023 ముద్రణ) అత్యుత్తమ గ్రంథంగా 2024కు ఎంపికైంది. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. సిద్దిపేట శ్రీవాణి సాహిత్య పరిషత్ అధ్యక్షుడు పెందోట వెంకటేశ్వరరావు ఈ మేరకు కథల సంపుటిని ఎంపిక చేశారన్నారు. సాహితీ సంస్థ నిర్వహించిన ఈ పోటీ కోసం వచ్చిన మొత్తం 80 గ్రంథాలలో కథల సంపుటి విభాగంలో స్వర్ణశిఖరాలు గ్రంథాన్ని 2024 అత్యుత్తమ విశిష్ట కథల సంపుటి గ్రంథంగా ఎంపిక చేశారని తెలిపారు. త్వరలో సిద్దిపేటలో జరగనున్న సాహితీ సభలో పురస్కారం అందుకోనున్నట్లు వివరించారు.

మహదానందమే.. మహా భాగ్యమే



అప్పనపల్లిలో బాలబాలాజీ స్వామివారి ఆలయం

- నేటి నుంచి అప్పనపల్లిలో కల్యాణోత్సవాలు
- రేపు రాత్రి 8.59 గంటలకు బాలాజీ స్వామి కల్యాణం

మామిడికుదురు: నిత్య కల్యాణం.. పచ్చతోరణంగా విరాజిల్లుతున్న అప్పనపల్లి శ్రీబాల బాలాజీస్వామి ఆలయం దివ్య తిరు కల్యాణ మహోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. పచ్చని మామిడి తోరణాలు, చలువ పందిళ్లు, విద్యుద్దీప కాంతులు, కర్పూర పరిమళ సుగంధ ద్రవ్యాలతో శ్రీవారి ఆలయం శోభాయమానంగా కనువిందు చేస్తోంది. స్వామి కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి గురువారం వరకూ ఐదు రోజుల పాటు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జ్యేష్ఠ శుద్ధ దశమి ఆదివారం స్వామివారి కల్యాణోత్సవాలకు అంకురార్పణ జరుగుతోంది. స్వామివారి తిరు కల్యాణం సోమవారం రాత్రి 8.59 గంటలకు నిర్వహిస్తారు. పాంచరాత్ర ఆగమానుసారం స్వామివారి కల్యాణోత్సవాలను నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి గ్రంధి మాధవి తెలిపారు.

ఆలయానికి చేరుకునేది ఇలా..

అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయానికి వచ్చే భక్తులు రాజమహేంద్రవరం నుంచి వయా రావులపాలెం, గంటి మీదుగా తాటిపాక చేరుకోవచ్చు. రాజమహేంద్రవరం నుంచి ఆలయానికి 70 కిలోమీటర్లు. కాకినాడ నుంచి అమలాపురం, పాశర్లపూడి మీదుగా అప్పనపల్లి చేరుకునే వారికి 64 కిలోమీటర్లు. పైన పేర్కొన్న ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సు సదుపాయం అందుబాటులో ఉంది.

నూతన ఆలయ నిర్మాణం

1970 మార్చి 18న నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. కొబ్బరి కొట్టులో ప్రతిష్ఠించిన శ్రీవారి చిత్రపటాన్ని అలాగే ఉంచి దానికి సమీపంలో నూతన ఆలయ నిర్మాణానికి రూపకల్పన చేశారు. కొత్తగుడిపై చిత్రీకరించిన గోవు-గొల్లవాడు, గీతోపదేశం వంటి అద్భుత చిత్రాలు భక్తులను పరవశింపజేస్తాయి. 1981లో దేవదాయశాఖ ఈ ఆలయాన్ని స్వాధీనం చేసుకుంది. దీనిపై కోర్టులో వాజ్యాలు నడిచాయి. 1990 ఏప్రిల్ 9న దేవాలయాన్ని దేవదాయ ధర్మాదాయ శాఖకు ధారాదత్తం చేస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. 1991 జూలై 4న టీటీడీ ఉచితంగా సమర్పించిన మూల విరాట్, రాయితీపై కొనుగోలు చేసిన పద్మావతి, ఆండాళ్, గరుడాళ్వార్‌లను శ్రీమాన్ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠించారు.

తొలిరోజు కార్యక్రమాలు

అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆదివారం ఉదయం ఐదు గంటలకు సుప్రభాత సేవతో కల్యాణోత్సవాలకు శ్రీకారం చుడతారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అమలాపురం వారిచే కోలాటం, శ్రీలక్ష్మీ వల్లభ అన్నమయ్య భజన మండలి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమం ఉంటుంది. ఆరు గంటలకు శ్రీవిష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశనం, పరిషత్ దక్షిణ, ఋత్విక్‌వరుణ తదితర పూజలు ఉంటాయి.

చరిత్ర ఇది..

శ్రీబాలబాలాజీ స్వామి కొబ్బరి కొట్టులో వెలిశాడు. 1960లో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని తీసుకువచ్చి ఇక్కడ ప్రతిష్ఠించారు. ఆలయ వ్యవస్థాపకుడు మొల్లేటి రామస్వామి పూర్వం కొబ్బరి కాయల వ్యాపారం చేసేవారు. ఆ వ్యాపారం నష్టాలతో నడుస్తుండటంతో తిరుమల శ్రీవారికి వ్యాపారంలో వాటా పెట్టారు. అప్పటి నుంచి ఆ వ్యాపారం లాభాల బాటలో పయనించింది. ఆ కొబ్బరి కొట్టులో తిరుపతి నుంచి తీసుకువచ్చిన శ్రీవారి చిత్రపటాన్ని ప్రతిష్ఠించారు. ఆ విధంగా శ్రీబాల బాలాజీ స్వామివారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చేవారు. వారి సంఖ్య క్రమేపీ పెరిగింది. ఇలా నూతన ఆలయ నిర్మాణాన్ని దేవస్థానం నిర్మాత రామస్వామి పూర్తి చేయించారు.



ఉభయ దేవేరులతో కొలువుదీరిన బాలబాలాజీ స్వామి

నేటి నుంచి ఆఈట్ రెండో దశ ప్రవేశాలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్ (ఆఈట్) ద్వారా సెల్ఫ్ సపోర్ట్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం నుంచి రెండో దశ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సంచాలకుడు ఆచార్య డీపీ నాయుడు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి 20 వరకు రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల అప్‌లోడ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఖాళీల వివరాలను ఈ నెల 21న వెబ్‌సైట్‌లో ఉంచుతారు. వెబ్‌ఆప్షన్లు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఇవ్వాలి. 27న రెండో దశ సీట్ల కేటాయింపు ఉంటుంది. ప్రవేశాలు పొందిన వారు ఈ నెల 28 నుంచి జూలై 4వ తేదీ లోగా నిర్ణీత ఫీజు చెల్లించాలి.

ఆవులు, ఎద్దులను వధిస్తే కఠిన చర్యలు

అమలాపురం టౌన్: గోవధ నిషేధ, పశు సంరక్షణ చట్టం-1977 ప్రకారం ఎవరైనా ఆవులు, ఎద్దులను వధిస్తే కఠిన చర్యలు తప్పవని పశు సంవర్ధక శాఖ అమలాపురం సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయరెడ్డి హెచ్చరించారు. ముఖ్యంగా ఆవులను ఉద్దేశపూర్వకంగా చంపరాదని సూచించారు. ఈ మేరకు అమలాపురంలో శనివారం డాక్టర్ విజయరెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. బక్రీద్ సందర్భంగా ఎలాంటి జంతు వధ నిర్వహించినా బాధ్యులపై చర్యలు ఉంటాయన్నారు. పశువులు అంటే ఎద్దు, దున్న, గేదె తదితర జంతువులను చంపాలంటే వాటి వయసు కనీసం 14 ఏళ్లు దాటి ఉండాలన్నారు. అదీ ప్రభుత్వ వైద్యుడి నుంచి ధ్రువీకరణ పత్రం పొందాక, ప్రభుత్వం అనుమతి ఉన్న కబేళా (పశు వధశాల)లో మాత్రమే వధించాలన్నారు. రోడ్లు, ఇళ్లలో ఎక్కడ పడితే అక్కడ పశువులను వధించడం, మాంసాన్ని విక్రయించడం నేరమని స్పష్టం చేశారు.

పొట్టకూటికి వెళ్లి అనంత లోకానికి..

- సౌదీలో ఓ వ్యక్తి మృతి
- పెళ్లి రోజునే అంతిమక్రియలు



విజయరాజు (ఫైల్)

పెరవలి: పొట్టకూటి కోసం దేశం కాని దేశం వెళ్లిన ఓ వ్యక్తి మృతితో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది. స్వదేశానికి చేరిన ఆ మృతదేహానికి శనివారం అంత్యక్రియలు నిర్వహించడం, అదేరోజు మృతుడి పెళ్లిరోజు కావడంతో తీవ్ర విషాదం నెలకొంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పెరవలి మండలం నల్లాకులవారిపాలెం గ్రామానికి చెందిన సోడాబత్తుల విజయరాజు (43) ఎనిమిదేళ్ల కిందట సౌదీ అరేబియాకు ఉపాధి నిమిత్తం వెళ్లాడు. ఆ దేశంలో 2023 మార్చి 30న ఉదయం బాత్‌రూమ్‌లో కాలుజారి పడిపోయాడు. తమ స్నేహితుడు ఎంత సేపటికీ బయటకు రాకపోవటంతో సహచరులు బాత్‌రూమ్ వద్దకు వెళ్లి చూసేసరికి తీవ్ర రక్తస్రావంతో స్పృహ కోల్పోయి పడి ఉండటం గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించారు. దీంతో రెండు నెలలు కోమాలో ఉన్న విజయరాజు తరువాత కళ్లు తెరవడంతో స్నేహితుల ఆనందానికి అవధులు లేకుండాపోయింది. కానీ ప్రమాదానికి గురైన విజయరాజుకు ఆ తరువాత పరీక్షల్లో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి పెరాలసిస్‌కు గురయ్యాడని స్నేహితులు తెలిపారు. ఆనాటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ ఏడాది ఏప్రిల్ 27న మృతి చెందగా, ఆదివారం అతని మృతదేహాన్ని స్వగ్రామం నల్లాకులవారిపాలేనికి తీసుకు రావటంతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని తీసుకు రావటానికి 49 రోజుల సమయం పట్టింది. ఇదే రోజు అతని పెళ్లి రోజు కావడం గమనార్హం. విజయరాజుకు భార్య సరసదేవి, కుమారులు జ్యోతి ప్రకాష్ (13), హర్ష వర్ధన్ (11), అలాగే తల్లిదండ్రులు ఉన్నారు. ఎంబాసీ అధికారి జస్విందర్ సింగ్ తెలుగు సంఘం నాయకుల సహకారంతోనే మృతదేహాన్ని ఇక్కడకు తీసుకు వచ్చారని కుటుంబ సభ్యులు తెలిపారు.



నల్లాకులవారిపాలేనికి అంబులెన్స్‌లో తీసుకువచ్చిన విజయరాజు మృతదేహం


యర్రపోతవరం ఘటనలో ఇద్దరి అరెస్ట్

రామచంద్రపురం: యర్రపోతవరం ఇరిగేషన్ లాకుల వద్ద ఈ నెల 8న బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఎడమ చేతికి చెప్పుల దండ వేసి, వర్గ విభేదాలు సృష్టించేందుకు బోర్డు రాసి వేలాడదీసిన ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ వెల్లడించారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై గ్రామానికి చెందిన విప్పర్తి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పామర్రు పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామన్నారు. జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఎస్‌కే ఖాదర్ బాషా పర్యవేక్షణలో దర్యాప్తు అధికారి రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ నేతృత్వంలో సీఐ పి.దొరరాజు, సర్కిల్ ఎస్సైలు, సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దర్యాప్తు నిర్వహించినట్లు తెలిపారు. ఈ మేరకు 14న ముద్దాయిలైన గ్రామానికి చెందిన పి.రాంబాబు, కె.స్వామి నాయుడులను అరెస్ట్ చేశామన్నారు. వీరు 8న రాత్రి చెత్త కుప్ప నుంచి సేకరించిన మూడు చెప్పులతో దండగా కట్టి, వైట్ పేపర్‌పై కొన్ని వర్గాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేలా రాసి బోర్డును విగ్రహం ఎడమ చేతికి తగిలించినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. విచారణలో వారు నేరం అంగీకరించారన్నారు. దర్యాప్తులో భాగంగా నేరానికి ఉపయోగించిన వస్తువులు, సెల్ ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన దర్యాప్తు అధికారి డీఎస్పీ రామకృష్ణ, సహకరించిన సీఐ పి.దొరరాజు, పామర్రు ఎస్సై జానీబాషా, సిబ్బందిని ఎస్పీ శ్రీధర్ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామకృష్ణ, సీఐ దొరరాజు, పామర్రు ఎస్సై జానీబాషా

ట్యూమర్... టెర్రర్



- మెదడు సమస్యలతో బాల్యం, యువత
- అత్యాధునిక పరీక్షలతో సత్వర గుర్తింపు
- రెండో దశలో చికిత్సతో ఉపశమనం

అమలాపురం టౌన్: మనిషి మనుగడకు అతని మెదడే కీలకం.. అది ఆరోగ్యంగా ఉంటేనే శరీరంలో అన్ని అవయవాలను అదుపులో ఉంచుతోంది. అలాంటి మెదడు గతి తప్పితే ప్రమాదమే. జిల్లాలో ఇటీవల కాలంలో బ్రెయిన్ ట్యూమర్, బ్రెయిన్ స్ట్రోక్ కేసులు అధికమవుతున్నాయి. గతంలో ఈ మెదడు సంబంధిత వ్యాధులు 50 ఏళ్ల వయసు దాటిన వారికి వచ్చేవి. ఇటీవల కాలంలో పది నుంచి 15 ఏళ్ల పిల్లలు, 30 నుంచి 40 ఏళ్ల వయస్కులకు కూడా వచ్చి ఆసుపత్రుల పాలవుతున్నారు. చిన్న పిల్లల్లో జన్యుపరమైన లోపాలతోపాటు మారుతున్న ఆహార అలవాట్లు కూడా మెదడు వ్యాధులకు కారణమవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. మరి కొంతమందికి పొగ, మద్యం తీసుకోవడంతో వస్తోంది. ఇటీవల కాలంలో బ్రెయిన్ ట్యూమర్, స్ట్రోక్ వ్యాధులు బయటపడి ఆసుపత్రులకు వెళుతున్న వారి సంఖ్య జిల్లాలో నెలకు పది నుంచి పదిహేను వరకూ ఉంటోంది. ఈ రోగులకు అత్యవసర వైద్యం నిమిత్తం కాకినాడ, రాజమహేంద్రవరం, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు రోగి బంధువులు ఉన్నఫళంగా పరుగులు తీస్తున్నారు. న్యూరాలజీ స్పెషలిస్టులు, సర్జన్లను ఆశ్రయిస్తున్నారు.

తలనొప్పితో మొదలై..

సాధారణంగా తలనొప్పి అప్పుడప్పుడు వస్తుంది. అయితే పదే పదే వస్తే మెదడుకు సంబంధించి సమస్యలు ఉత్పన్నమైనట్లు గుర్తించవచ్చు. తర్వాత తల తిరగడం, వాంతులు వంటి లక్షణాలు బయటపడతాయి. ముఖ్యంగా ఆ వ్యాధి నాలుగు దశల్లో వృద్ధి చెందుతుంది. మొదటి దశలో తలనొప్పి, వాంతులు, తల తిరగడం, రెండో దశలో తీవ్రమైన తలనొప్పి, అకారణంగా, అమాంతంగా వాంతులు అవడం జరుగుతోంది. మూడో దశలో మెదడులోని ట్యూమర్ ఇతర అవయవాలకు వ్యాప్తి చెందుతుంది. తర్వాత ఊపిరితిత్తులు, వెన్నెపూసలకు క్రమేపీ విస్తరిస్తుంది. నాలుగో దశలో ట్యూమర్ కణాలు రక్తంలో కలసి శరీరమంతా వ్యాప్తి చెందుతుంది. ఈ నాలుగు దశల తర్వాత వ్యాధి తీవ్రత దాల్చి రోగి మరింత క్షీణించేలా చేస్తుంది.

నిర్ధారణకు అత్యాధునిక పరీక్షలు

గతంలో బ్రెయిన్ ట్యూమర్‌తో వచ్చిన రోగి నాలుగో దశ వచ్చే వరకూ గుర్తించే వారు కాదు. అప్పట్లో వ్యాధి నిర్ధారణ కాక ముందే లేదా నిర్ధారణ అయ్యాక అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయి ఒక్కోసారి రోగి ప్రాణాలు కూడా దక్కేవి కావు. ఇప్పుడు అత్యాధునిక డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులోకి రావడంతో వ్యాధి నిర్ధారణ తొందరగా జరిగి సకాలంలో చికిత్స మొదలు పెట్టేందుకు వీలు చిక్కుతోంది. తరచూ తలనొప్పితో వచ్చే రోగికి తొలుత సిటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్‌లు చేయడం ద్వారా బ్రెయిన్ ట్యూమర్‌ను వైద్యులు గుర్తిస్తున్నారు. ప్రస్తుతం సిటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్‌ల సౌకర్యం జిల్లాలో పలు ప్రాంతాల్లో విస్తరించడంతో వ్యాధిని తొలి లేదా రెండో దశలోనే గుర్తించి అంతే వేగంగా చికిత్స మొదలు పెట్టడంతో రికవరీ శాతం పెరుగుతోంది. నాలుగు దశల్లో ఆయా దశలను బట్టే వైద్యులు సేవలు అందిస్తున్నారు. కొంతమంది రోగులకు వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స చేస్తున్నారు. కొందరికి మందులు ఇస్తూ క్రమేపీ ట్యూమర్‌ను తగ్గిస్తారు. మరి కొందరికి శస్త్రచికిత్స ద్వారా ట్యూమర్‌ను తొలగిస్తారు. రేడియేషన్ థెరపీ, కిమో థెరపీ వంటి చికిత్సల ద్వారా వ్యాధిని నయం చేసేందుకు వైద్య ప్రక్రియలు ఉపయోగిస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన రోగులకు ముందు మాట నత్తి రావడం, మూతి కొద్దిగా వంకర పోవడం, కాలు, చెయ్యి కొద్దిగా లాగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మాట నత్తిగా వస్తున్న దశలోనే రోగులు సంబంధిత వైద్య నిపుణులను తక్షణమే సంప్రదిస్తే అత్యవసర వైద్యం అందిస్తే తొందరగా కోలుకునే పరిస్థితి ఉంటుంది.

తక్షణమే వైద్యం అందాలి



బ్రెయిన్ ట్యూమర్, బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు బయట పడిన వెంటనే గుర్తించి వైద్యం పొందితే ఆ రోగి తొందరగా రికవరీ అయ్యే అవకాశం ఉంటుంది. తలనొప్పి తీవ్రంగా వస్తున్నా, మాట్లాడినప్పుడు తేడా కనిపించినా న్యూరో విభాగం వైద్యులను సంప్రదించాలి. సకాలంలో వ్యాధిని గుర్తించి అంతే వేగంగా వైద్యం పొందితే ఆ రోగి చాలా వరకూ కోలుకుంటాడు. ఈ తరహా రోగులు వైద్యం అందాక పూర్తిగా కోలుకుని యథావిధిగా తమ పనులు చేసుకునే పరిస్థితిని గత రెండేళ్ల నుంచి అనేకం చూస్తున్నాం.

– డాక్టర్ లింగోలు చందు, న్యూరో సర్జన్, కాకినాడ

వాడపల్లి... భక్తులతో శోభిల్లి



ఆలయం వద్ద భక్తుల రద్దీ

- మార్మోగిన గోవింద నామస్మరణ
- ఒక్కరోజే రూ.39.16 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం శనివారం భక్తులతో నిండిపోయింది. గోవింద నామస్మరణ ఆ పరిసర ప్రాంతాల్లో మార్మోగింది. ఉదయమే స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి దర్శనభాగ్యం కలిపించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు వెంకన్న స్వామితో పాటు ఆలయ ఆవరణలో అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఈ ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్, ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు. స్వామివారి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాదాల విరాళం, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదం విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ ద్వారా సుమారు రూ.39,16,161 ఆదాయం సమకూరింది. ట్రాఫిక్ సమస్య రాకుండా ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

■ ఇంటర్ M.P.C. పాసయ్యారా! చేరండి విజయవాడలో B.Sc. (Hons) - AI & ML / డేటాసైన్స్/ డిజిటల్ ఫోరెన్సిక్స్ & సైబర్ సెక్యూరిటీ/డైరీసైన్స్; B.VOC. రేడియాలజీ; BBA - ఏవియేషన్ డిగ్రీ కోర్సులు. మంచి ఉద్యోగాలు, జీతం వచ్చును. ✆ :79896 47611. [V- 2585]

Real Estate

FLAT FOR SALE

■ నిడదవోలు, గాంధీనగర్ లయన్స్ కంటి ఆసుపత్రి రోడ్ సూర్య రెసిడెన్సినందు డబుల్ బెడ్‌రూం ఫ్లాట్ East Facing, 1st Floor అమ్మకంనకు కలదు. ఫోన్ : 94410 37735 [V- 2581]

■ RJY, V.L.Puram 3BHK Deluxe E/F Flats for sale 1510 Sft. ready to occupy lift & car parking available contact. ✆ : 99088 71143 [R-6811]

HOUSE FOR SALE

■ House for Sale సర్పవరంలో చైతన్య రాజు విల్లాస్ ఎదురుగా G+1 ఈస్ట్ ఫేసింగ్, 210 స్క్వేర్ యార్డ్స్ గల హౌస్ అమ్మకము నకు కలదు. సెల్: 92900 28461, 81423 32667 [R-2169]

LAND FOR SALE

■ విశాఖలో పరవాడ దీపాంజలినగర్ ఎదురుగా VUDA వెంచర్స్ ఆనుకొని 17 ఎకరాలు భూమి అమ్మకం. నో బ్రోకర్స్. సంప్ర : 63094 13937 [V- 1988]

■ 3 Cents East Facing Land for sale in Housing Board Colony near Red Bridge, Amalapuram. Contact : 7993833919 [HA-1833]

■ సామర్లకోట మండలం, G.మేడపాడు, G.కొత్తూరు పోవు, తారురోడ్‌ను చేర్చి 1 ఎకరం పామాయిల్ తోట 3 సం॥ది అమ్మకంనకు కలదు. 9966797676 [C-800292]

TO-LET

■ Ready. Decent House for office/Residence, Teak & Marble & Almirahs, in all rooms Bhaskar Nagar- RJY. ✆ : +91-92913 28926 [R-6777]

PLOT FOR SALE

■ విశాఖలో పరవాడ దగ్గర ఉడా అప్రూవ్డ్ లేఅవుట్‌లో 40 Ft. BT రోడ్డు, డ్రైనేజ్, పార్క్ & విద్యుత్ సౌకర్యాలతో 267, 200, 167 చ॥గ॥ ప్లాట్లు రిజిస్ట్రేషన్‌తో చ॥గ॥రూ. 6500/- లకే అమ్మకం. నో బ్రోకర్స్. సంప్ర : 96761 96983 [V-1987]

■ కాకినాడ జిల్లా పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌లో పద్మనాభం కాలనీ, పాత RTC బస్‌స్టాండ్ దగ్గర DTCP అప్రూవల్ లే అవుట్‌లో ప్లాట్ నెం. 1, 2, 3 అమ్మబడును. ✆ : 89775 77487 [R-1229014]

Services

FOR SALE

■ ఫారిన్ కరెన్సీ నోట్లు, కాయిన్స్ సేకరించే వారికి 200 వివిధ దేశాల నోట్స్, 200 కాయిన్స్ అమ్మకమునకు కలవు. కావలసిన వారు సంప్రదించండి. ✆ : 98486 03079 [R-1229011]

GROUNTING WORKS

■ గ్రౌంటింగ్ వర్క్స్ : శ్లాబులు, వాటర్ ట్యాంకులు, బాత్‌రూమ్ లీకేజీలు, గోడ బెమాయింపులు, గోడ పగుళ్ళు మొదలగునవి కెమికల్స్‌తో 100% గ్యారంటీతో గ్రౌంటింగ్ చేయబడును. M.S. గ్రౌంటింగ్ వర్క్స్, డైరీ ఫారం సెంటర్, కాకినాడ సెల్: 83748 47738 [R-2168]

BUSINESS OFFER



■ కాకినాడలో ఫుడ్ పాయింట్ లీజ్‌కి ఇవ్వబడును. అగ్రిమెంట్ చేయవలెసి ఉంటుంది (లేదా) ఇన్వెస్ట్‌మెంట్ పార్టనర్ కావలెను. ఫోన్ : 81254 04424 [V- 12230]

OLDAGE HOME

■ ఆదరణ హోమ్‌కేర్ సర్వీసెస్, చిన్నపిల్లలను, వృద్ధులను, పేషెంట్లను మీ ఇంటివద్ద / ఆసుపత్రిలో సర్వీస్ చేయుటకు నర్సులు, ఆయాలు, అటెండర్స్‌ను మీ వద్దకు పంపబడును. ✆ : 91105 18713, 85008 77618 [R-1606]

Wanted

■ రాజమండ్రి T.Nagarలో ఉన్న ప్రముఖ మిల్క్ డైరీ నందు సేల్స్‌మెన్‌గా పనిచేయుటకు యువకులు కావలెను. వ: 18-30 సం॥. అ: డిగ్రీ. సంప్ర॥ 92465 50443 [R-1154959]

■ శ్రీ వెంకటపద్మ ఆటోమోటివ్, RJY నందు పనిచేయుటకు మేనేజర్లు, సేల్స్ఎగ్జిక్యూటివ్, కంప్యూటర్‌పట్ల అవగాహనకల్గిన టెలీకాలర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. వెహికల్ ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్గిన వారికి ప్రాధాన్యత ✆ : 90145 08894 [R-1608]

■ ★ RJY లో R.E ఆఫీస్‌కు బాదరబందీ లేని 45 సం॥ల హిందూ స్త్రీకి వసతి+జీతం + 2 వీలర్ & భవిష్యత్తుకు భరోసా ★ మార్కెటింగ్ మిత్రులకు ఆహ్వానం! ✆ : 93900 60136 [R-511]

■ Wanted Teachers : Pre-Primary Teachers-02 No's, English Faculty for High School-01, Mathematics-01. GTLC EM School, Rajahmundry. Ph : 98497 02543, 85007 37977 [R-6771]

■ సెక్యూరిటీగార్డ్11,000&ఆఫీస్‌బాయ్&ప్యాకింగ్ హెల్పర్10,000 PF&ESI 4Week ofహైస్కూల్‌రోడ్ సెంటర్,బజాజ్ఎలక్ట్రానిక్ షోరూంవేర్ హౌస్,అమలాపురం, 8074444019, 9989139239. [T-1252747]

■ ప్రముఖ రొయ్యల కంపెనీ నందు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ అమలాపురం, మలికిపురం, కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఉన్న స్టాఫ్ (M) కావలెను. Q: ITI, ఇంటర్, Dip, డిగ్రీ, జీ: 13000-15000/- (P+E+PF) 9115456456, 6300960372 [G-795853]

■ రాజమండ్రిలో ప్రముఖ బ్యాంక్ రికవరీ ఏజెన్సీ నందు పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను టూ వీలర్ మస్ట్, సెల్ : 9494407389, 6300184746 [C-800290]

■ కన్నబిడ్డలే కాదువి ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా,నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000,ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406. [HA-250]

■ విజయవాడలో పెద్దవారిని/బెడ్ పేషెంట్‌లని వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు కేర్‌టేకర్స్ M/F, ఆయాలు, నర్సులు కావలెను. వసతి + భోజనం + మంచి జీతం. ✆ 91608 35559, 98850 25559 [B-108]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సాప్ చేయగలరు. 95026 15217 [M-1185215]

■ మల్కిపురం ప్రముఖ హాస్పటల్ నందు నైట్ డ్యూటీ చేయుటకు నర్సింగ్ స్టాఫ్ పురుషులు కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్ర: 95151 07348 [P-779415]

■ గైనకాలజిస్ట్ & OT టెక్నీషియన్ కావలెను. అన్ని సదుపాయాలు గల ములుగు, వరంగల్ లోని ఒక హాస్పిటల్‌లో ఫుల్ టైమ్ కొరకు సంప్రదించండి నెం. 9949015656. [Z-1080589]

■ వాటర్‌వాష్ హెల్పర్లు, మెకానిక్ హెల్పర్లు కావలెను. అనుభవం బట్టి జీతం: రూ.12,000/- నుండి రూ.20,000/- వరకు. Cont శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్ : హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ. ✆ : 81434 12349 [R-29]

■ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లైఫ్‌కు ప్రతీ మండలం & పంచాయితీలో ఫైనాన్షియల్ డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. వయస్సు : 25 to 60 సం॥లు, అర్హత: 10th to డిగ్రీ, హౌస్ వైఫ్స్, ఏజెంట్స్, రిటైర్డ్ టీచర్స్, RMP డాక్టర్స్, అన్నిరంగాల వారు సంప్ర॥ ✆ : 99488 11272 కాకినాడ [R-2171]

■ Experienced, Qualified Lady Teachers to teach All Subjects for High School. Sadhana High School, Tilak St., Kakinada ✆ : 98482 26333 [R-113]

■ Wanted Teachers : Qualification : B.Ed/ D.Ed / B.Tech / B.Sc (Comp) / TTC. Required: Teacher's for Primary & Secondary, PET Computer Lab Asst., Cont.: 86882 66492, 86882 90286. Note: Fresh & Experie. Candidates (ONLY FOR BELIEVERS) At KKD [R-112]

■ లేడీటీచర్లు కావలెను. వసతి ఫ్రీ, అర్హత : D.Ed., B.Ed., డిగ్రీ. జీతం : రూ.7వేలు నుండి 9 వేలు. HM (F) రూ.15 నుండి 20 వేలు (అనుభవం ఉన్నవారు మాత్రమే). మీ Resume ను సెల్ : 98498 54673 కు వాట్సాప్ / మెసేజ్ పంపండి. విశ్వశాంతి E.M. స్కూల్ (ప్రైమరీ), మల్లాం, పిఠాపురం (మం), కాకినాడ జిల్లా. [R-2170]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్ నాలుగు లైన్లకు రూ.: 400/- అదనపు లైనుకు రూ.: 90/- GST 5% Extra

రీజనల్ సెంటర్లు - రాజమండ్రి - 9010224454, 9951602906, 9010120345, 9705754205
కాకినాడ - 90101 11140, 90109 67896, పిఠాపురం - 99516 02838,
తుని - 90109 67896, జగ్గంపేట - 99482 85589 యానాం - 90101 11140,
అమలాపురం-9705347414, 9705346456, 9848648081, 9010299082,
మండపేట: సెల్: 99516 02941, 08855-233559,
రామచంద్రపురం: సెల్: 99516 02936

సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం. ఫోన్స్: 0883-2483010

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.